

వెండి నాగ పడగల కొరత

నిలిచిన భక్తుల రాహు కేతు పూజలు

ముందస్తు అంచనా లేని అధికారులు

ప్రజాశక్తి- డెస్క్: శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సోమవారం భక్తులు రాహుకేతు పూజలు చేసుకోలేక ఇబ్బందులు పడ్డారు. శనివారం నుంచి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. సోమవారం అంబేద్కర్ జయంతి కావడంతో ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో ఆదివారం సాయంత్రం నుంచి రద్దీ మరింత పెరిగింది. సోమవారం రాహు కేతు పూజలకు భక్తులు తరలి వస్తారని దేవస్థానం అధికారులు ముందస్తు అంచనా వేయకపోవడంతో తగిన ఏర్పాట్లు చేయలేదు. దీంతో రాహుకాలం సమయంలో రాహు కేతు పూజ చేయించుకోవడానికి భక్తులు క్యూ లైన్లో వేచి ఉన్నారు. ఉదయం 8 గంటలకి రాహు కేతు టికెట్ కౌంటర్లు మూతపడ్డాయి. వెండి నాగ పడగల కొరత వల్ల టికెట్లు ఇవ్వలేకపోతున్నామని సిబ్బంది చేతలెత్తేశారు. 9 గంటల వరకు భక్తులు క్యూ లైన్లో వేచి ఉండి తర్వాత టికెట్లు కొనుగోలు చేశారు. క్యూలో మంచినీటి సరఫరా కూడా లేదు. నాగ పడగల తయారీ కేంద్రం అయిన మింట్ లో, స్టోర్లో నాగ పడగల నిల్వలున్నా కౌంటర్లకు సరఫరా కాలేదని సిబ్బంది చెబుతున్నారు. దీంతో భక్తులు రాహుకాలంలో రాహు కేతు పూజలు చేయించుకోలేక సతమతమయ్యారు. 500, 750 రూపాయల టికెట్ల క్యూ లైన్లో వేచి ఉన్న భక్తులు రంగుల గోపురం దాటి నిలుచుకోవాల్సిన దుస్థితి వచ్చింది. నాగ పడగల కొరత కారణంగా భక్తులు క్యూ లైన్ లో ఉన్నారని సిబ్బంది వాకీటాకీల్లో అధికారులకు సమాచారం అందించారు. ఈవో బాపిరెడ్డి ఉదయం 9 గంటలకే కార్యాలయానికి చేరుకున్నారు. అయినా కౌంటర్ల వద్దకు రాలేదు. ఉదయం 11. 20 గంటలకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అప్పటివరకు అధికారులెవరూ కౌంటర్ వద్దకు రాలేదు. ఫలితంగా సోమవారం రాహుకాలంలో రాహు కేతు పూజ చేయించుకోవాలనే కోరిక భక్తులకు నెరవేరలేదు. నాగ పడగలతో పాటు తమల పాకులు కూడా పూజకు అందుబాటులో లేవు. రద్దీకి అనుగుణంగా పూజా సామాగ్రిని సమకూర్చుకోవాల్సిన సిబ్బంది పట్టించుకోలేదు. సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన అధికారులు కూడా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. మధ్యాహ్నానికి సుమారు 5 వేల పూజలు జరిగాయి. ఆలయానికి 75 శాతం ఆదాయం రాహుకేతు పూజల ద్వారా వస్తోంది. అయినా పూజలు సక్రమంగా నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పూజల ద్వారా వచ్చే ఆదాయంలో వాటాల కోసం కొందరు పోటీలు పడుతున్నారన్న అపవాదు మాత్రం మూటగట్టుకుంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



సాయితేజ, యాస్మిన్ పెళ్లినాటి ఫోటో

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అనుమానస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన సోమవారం చిత్తూరు నగరంలోని బాలాజీ కాలనీలో చోటు చేసుకుంది. మృతురాలు యాస్మిన్ (26) తల్లిదండ్రులు తమ కుమార్తె ఇంట్లో ఉరేసుకొని మృతి చెందడానికి అత్త ఇంటి వేధింపులే కారణమంటూ ఉండగా, యాస్మిన్ భర్త సాయితేజ తన భార్యను ఆమె తల్లిదండ్రులే హత్య చేశారంటూ ఆరోపిస్తున్నారు. హిందూ యువకుడిని వివాహం చేసుకుందనే కారణంతోనే హత్య చేశారని, ముమ్మాటికి ఇది పరువు హత్య అనే ఆరోపిస్తున్నారు. యాస్మిన్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందా లేదా ఇది పరువు హత్య అనే విషయం పోలీసులు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు నగరంలోని బాలాజీ కాలనీలో ముంతాజ్, షౌకత్ ఆలీ కాపురం ఉంటున్నారు. మృతురాలి తండ్రి షౌకత్ ఆలీ చిత్తూరు రూరల్ మండలం తుమ్మిందపాలెంలో ఆర్ఎంపీ డాక్టర్గా క్లినిక్ నిర్వహిస్తున్నాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు పెద్ద కుమార్తె తస్లీమా, రెండవ కుమార్తె నస్రిన్ భాను, చిన్న కుమార్తె యాస్మిన్. యాస్మిన్ ఎస్వి సెట్ కాలేజీలో ఎంబీఏ పూర్తి చేసింది, ఉద్యోగ ప్రయత్నంలో ఉండగా తల్లిదండ్రులు యాస్మిన్కు చిత్తూరు నగరంలోని రామ్ నగర్ కాలనీకి చెందిన షరీఫ్ అనే యువకుడితో వివాహం నిర్ణయించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన వివాహం నిశ్చయమైంది. మరో మూడు రోజుల్లో వివాహం ఉండగా ఫిబ్రవరి 6వ తేదీ ఇంటి నుండి వెళ్లిపోయిన యాస్మిన్ తన ఎంబీఏ క్లాస్మేట్ అయిన పూతలపట్టు మండలం పోర్టుకనుమ గ్రామానికి చెందిన సాయితేజను ప్రేమ వివాహం చేసుకుంది. అప్పటి నుంచి యాస్మిన్, సాయితేజ కలిసి పోర్టుకనుమ గ్రామంలో జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా తల్లిదండ్రుల ఆహ్వానం మేరకు సోమవారం ఉదయం షౌకత్ ఆలీ యాస్మిన్ను బాలాజీ కాలనీలోని ఇంటికి తీసుకొచ్చి తమ పరువు పోయిందంటూ నానా బూతులు తిట్టాడు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో యాస్మిన్ ఇంట్లో ఫ్యాన్కు ఉరివేసుకుని మతి చెందినట్లు గుర్తించామని యాస్మిన్ తల్లిదండ్రులు టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. యాస్మిన్ను గాంధీ విగ్రహం వద్ద తండ్రితో పాటు ద్విచక్రవాహనంలో పంపించే సమయంలో అక్కడే భర్త సాయితేజ ఉన్నానిని, యాస్మిన్ ఇంటికి వెళ్ళాని, తర్వాత నేను వస్తానని చెప్పినట్లు సాయితేజ చెబుతున్నారు. మతురాలు యాస్మిన్ తల్లిదండ్రులు, భర్త ఇద్దరి ఫిర్యాదు మేరకు చిత్తూరు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి హత్యా, ఆత్మహత్య అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పిద్దాం

- స్కూళ్లు మూతబడకుండా కాపాడుకుందాం..!
- 'విద్యారంగ సంస్కరణలు' సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్సి లక్ష్మణరావు

ప్రజాశక్తి - డెస్క్: 'విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించి.. బడులు మూతబడకుండా కాపాడుకుందాం' అని వక్తలు పిలుపునిచ్చారు. తిరుపతి నగరంలో కచ్చపి కళాక్షేత్రంలో 'విద్యారంగ సంస్కరణలు.. ఆర్థిక అంశాలు'పై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, శాసనమండలి మాజీ సభ్యులు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, ఎస్ఎస్ నాయుడు, నవ కోటేశ్వరరావు, జివి రమణ, జ్యోతిబసు, చక్రవర్తి, కె.ముత్యాలరెడ్డి, జిజె రాజశేఖర్, ఎం.సోమశేఖర్నాయుడు పాల్గొన్నారు. 2018 లో 38 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండేవారని, కానీ నేడు అది 32.61 లక్షల మందికి తగ్గిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉండాలని, 12వ పిఆర్సిని అమలు చేయాలని సదస్సు పేర్కొంది.

'బడిమూత'ను నిరసిస్తూ 'అంబేద్కర్కు' వినతి

రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడాన్ని, ప్రభుత్వ స్కూళ్లను మూసి వేయడాన్ని నిరసిస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం నాటి సాయంత్రం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద 'అంబేద్కర్' విగ్రహానికి వినతి పత్రాన్ని అందించి నిరసన తెలిపారు. 117, 128 జీవోలను రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం దొడ్డి మార్గంలో మెమోను తెచ్చి విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, ఐద్వా జిల్లా కార్యదర్శి పి సాయిలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, యుటిఎఫ్ రాష్ట్ర నేతలు జీవీ రమణ, ఎస్ ఎస్ నాయుడు, ముత్యాల రెడ్డి, మణికంఠ తదితరులు తీవ్రస్థాయిలో విమర్శించారు. తిరుపతి జిల్లాలో 900 కు పైగా పాఠశాలలు మూసివేయబడుతున్న పరిస్థితి అన్యాయమని, కలెక్టర్ నుంచి ఎంఈఓ వరకు ఇదే పనిపై పోటీలు పడి ఒత్తిడి తెస్తున్నారని, ఇది సమంజసమైంది కాదన్నారు.



ప్రభుత్వ బడులను కాపాడుకుందాం అంటూ అంబేద్కర్కు ప్రజాసంఘాల వినతి

రెండు రోజుల మ్యాజిక్ వర్క్ షాప్ విజయవంతం



ప్రజాశక్తి -డెస్క్: వేమన విజ్ఞాన కేంద్రం, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల ఉచిత మ్యాజిక్ శిక్షణ వర్క్ షాప్ ను ఆది, సోమవారాలలో వేమన విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించారు. మేజీషియన్ యుగంధర్ బాబు శాస్త్రీయ అవగాహనతో కూడిన మ్యాజిక్ను పిల్లలకు నేర్పించారు. అనేక మూఢనమ్మకాలతో, మంత్రగాళ్లు, దైవాంశ సంభూతులమని చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని, అటువంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఇందులో మాయలేదు, మంత్రం లేదు ఉన్నదంతా సైన్స్ మాత్రమేనని అవగాహన కల్పించారు. మ్యాజిక్ కార్డ్స్, మాట వినే బంతి, ఈక్వల్ రోప్స్, నీటిని రంగు మార్చడం ఇలా దాదాపు 50 రకాల మ్యాజిక్ లను ఉత్సాహవంతులకు నేర్పించారు. వేమన విజ్ఞాన కేంద్రం గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, కార్యదర్శి మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, రెడ్డప్ప, బిర్లా నాయుడు, ఓ.వెంకటరమణ, నెల్లూరు మునిలక్ష్మి పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రిగా సిహెచ్సి

వసతుల ఏర్పాటుకు చర్యలు: ఎమ్మెల్యే

అట్టహాసంగా అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్ : వికోట మండల కేంద్రమైనలోని సిహెచ్సి ఆసుపత్రిని 30 నుంచి వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయనున్నట్లు పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణస్వీకరోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గాను, సభ్యులుగా ధీరజ్, సుకన్య, పద్మనాభంలతో కలసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వీ.కోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో నమోదు అవుతున్న ఓపి ఆధారంగా ఈ ఆసుపత్రిని అభివృద్ధి చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, వీలైనంత త్వరగా ఆసుపత్రిని వంద పడకలకు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆస్పత్రికి రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉందని ఇక్కడి వైద్యులు, సిబ్బందితోపాటు ప్రస్తుత కమిటీ సభ్యులు సమన్వయంతో మెరుగైన సేవలందించి మరింత మంచి పేరుని తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన అన్ని సౌకర్యాలను త్వరితగతిన పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా సేవలకు తగిన విధంగా సిబ్బంది నియామకం, ఆస్పత్రి ఆవరణలో తాగునీటి సౌకర్యం, పోస్టుమార్టం గది ఏర్పాటు కృషి చేస్తామన్నారు. తదనంతరం ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశమై సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు రామచంద్ర నాయుడు, పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ గౌడ్, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలి : జెసి



చిత్తూరు సభలో మాట్లాడుతున్న జెసి విద్యాధరి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజంలో గౌరవం పెరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పేర్కొన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి జి.చిన్నయ్య, ఆర్డీఓ శ్రీనివాసులుతో కలసి భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమంలో జెసి పాల్గొన్నారు. జెసి మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే చదువు అవసరమన్నారు. స్కూల్స్ కాలేజీల్లో ఆడపిల్లలు చదువుకోవడానికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయని బాగా చదువుకోవాలని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, హక్కుల సాధనకు కృషి చేసిన చిరస్మరణీయడు అంబేద్కర్ అని అన్నారు. అంతేకాకుండా రాజ్యాంగ రచనలో కీలకపాత్ర పోషించారని, అణగారిన వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేశారన్నారని కొనియాడారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మాల ఫైన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు పి.యుగంధర్, బాబు, డివిఎంసి సభ్యులు రాజ్ కుమార్, ధనశేఖర్, శంకర్, రవి, బాబు, దేవరాజులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి


సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా చిత్తూరులో అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ మనువాదానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటం చేసిన గొప్ప మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ విధానాలను మనువాదాన్ని ముందుకు తెచ్చి మతాల మధ్య చిచ్చు పెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని, దీనిని దేశంలోని లౌకికవాదులు అందరూ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో అమలు చేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళు లర్పించినట్లు అవుతుందని అన్నారు. రాజ్యాంగాన్ని కించపరుస్తూ పార్లమెంట్లో మాట్లాడుతున్న అమిత్షా పై చర్య తీసుకున్నప్పుడే అంబేద్కర్ ఆశయాలను ముందుకు వెళ్తాయని తెలిపారు. మతసామ్రసాన్ని కాపాడాలని, వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు చిట్టెమ్మ, ప్రసాద్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



చిత్తూరులో సిపిఎం నాయకుల నివాళి

పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం చరిత్రలో నిలిచిపోయేలా 134వ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సిఆర్.రాజన్, చిత్తూరు మేయర్ అముద, చుడా ఛైర్మన్ కఠారి హేమలత, ఎస్పీ మణికంఠన్ చందోలు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబులు అతిధులుగా హాజరయ్యారు. ముందుగా బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో వేలాది మంది ప్రజల సమక్షంలో భారీ కేక్ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, పూతలపట్టు, ఐరాల, బంగారుపాళ్యం, తవణంపల్లె, యాదమరి మండలాల అధ్యక్షులు దొరబాబు చౌదరి, గిరిధర్ బాబు, ఎన్పి.జయప్రకాశ్ నాయుడు, గాలి దిలీప్ కుమార్, ముర్తోజీ యాదవ్, ఐరాల జెడ్పిటీసీ సుచిత్ర, పూతలపట్టు జెడ్పిటీసీ దేవిక పాల్గొన్నారు.




పూతలపట్టులో..

అంబేద్కర్ విద్యావ్యవస్థ దిక్సూచి అని వైసీపీ రాష్ట్ర మేధావుల వేదిక కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా వైసీపీ సీనియర్ నాయకులు బాబు రెడ్డి, జడ్పిటిసి దేవిక, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జీవరత్నం, రవి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసే నివాళులర్పించారు. అంబేద్కర్ రథచక్రం కోలాటాలు, భజనలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.


గంగవరం: పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరు ఈశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం అంబేద్కర్ 134వ జయంతి పురస్కరించుకొని గంగవరం మండలం మేలుమాయి దళితవాడలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. నాయకులు శ్రీరాములు, విశ్వనాథ్, ప్రభాకర్, జగన్ మోహన్, హరి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల కేంద్రంలో ఎంపిపి బండి నాగరాణి ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.



బైరెడ్డిపల్లిలో..

బైరెడ్డిపల్లి: బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలోఎంపీపీ రాజేంద్ర బాలాజీ, మొగసాల రెడ్డప్ప, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంపి పెట్టడంతోపాటు అన్నదానం చేశారు. వైస్ ఎంపీపీ రూపాయి కుమార్, వైస్ ఎంపీపీ2 నారాయణ స్వామి, సర్పంచ్ కె.వెంకటేష్ పాల్గొన్నారు.



పుంగనూరులో..

సోమల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటాన్ని సోమల దళితవాడ నుండి సోమల బస్టాండ్ కూడలి వరకు ట్రాక్టర్లు ర్యాలీగా తీసుకువచ్చి బస్టాండ్లో అంజలి ఘటించారు. అన్ని సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలలయాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు

గుడిపాల: అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా గుడిపాల మండల కేంద్రంలోనీ అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ యువత అధ్యక్షులు నంబిక్ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలతో నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో అమలు చేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళులర్పించినట్లు అవుతుందని తెలిపారు. అనంతరం కేక్, మజ్జిగ పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు రామ్రాజ్, ఆనంద బాబు, ఎరుద్లై, కుమార్, పృధ్వీ పాల్గొన్నారు. కుప్పం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్రమణి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దళిత నాయకులు రామయ్య, విజయ్ కుమార్, నారాయణ, వాసు, గణేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎంపీడీవో హరి ప్రసాద్రెడ్డి



బంగారుపాళ్యంలో..

అధికారులతో నివాళి అర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, జీడీ నెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రమేష్ నివాళులర్పించారు. అలాగే టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవసుందరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తూగుండ్రం గ్రామ సచివాలయంలో సర్పంచ్ శ్రీ బాబు, ఎంపిటిసి వాణిశ్రీ కేశవులు, పంచాయతీ సెక్రటరీ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ కర్ణ వాళు లర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు నాగరాజ్ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి భారీ గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేకును కట్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



జీడీ నెల్లూరులో..

రొంపిచర్ల: రొంపిచర్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పుంగనూరు టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఘన నివాళులు అర్పించారు. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజాసంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పులిచర్ల మండలం దేవలంపేట సచివాలయంలో నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ చల్లా రామచంద్ర రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. వి కోటమండలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో అఖిలపక్ష నాయకులు వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ యువరాజ్, గణపతి, వెంకటస్వామి, డాక్టర్ తమీం ఖాన్, శ్రీనివాసులు, దొరస్వామి, బాబు, వినోద్ పాల్గొన్నారు.



యాదమరిలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో..

ఎస్ఆర్ పురం : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, తహశీల్దార్ లోకనాథ పిల్లై, ఎంపీడీవో మోహన మురళి పూలమాల వేసి నివాళి అర్పించారు. 49 కొత్తపల్లిమిట్ట యువత అంబేద్కర్ జయంతి సందర్భంగా కేరళ వాయిద్యాలతో నృత్యం చేస్తూ బాణా సంచాలు పేల్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

పుంగనూరు: మండల పరిధిలో అంబేద్కర్ జయంతి వేడుకలను మాల మహానాడు, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగమ్మ కట్ట మీద ఉన్న మాల మహానాడు కార్యాలయంలో రాష్ట్రకార్యదర్శి ఎన్ఆర్.అశోక్ ప్రత్యేకపూల అలంకరణ చేసి కేకును కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అంబేద్కర్ భవన్లో అన్నదానం చేశారు. సుమిత్ర రమణ, విశ్రాంత డిఎస్పి సుకుమార్, జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సబ్జాద్ బాష, టిడిపి నాయకులు మధుసూదన్ రాయల్, నూర్ బాషా, సర్వేయర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. సదుం మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామపంచాయతీ, గుండ్లూరువారిపల్లి దళితవాడలో దళిత బహుజన నాయకులు మల్లేపల్లి శ్రీనివాసులు, వేణు, మురళి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. విఆర్ఆర్ కాలనీలోఅంబేద్కర్ భవన్లో జరిగిన కార్యక్రమంలో ఎస్సై షేక్షా వలి, కృష్ణారెడ్డి, గిరిబాబు, వెంకటస్వామి, సీతాపతి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి సునీల్ కుమార్ మండలంలోని అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, వైసిపి మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, తులసి రామకృష్ణారెడ్డి, ఫిరోజ్ అహ్మద్ పాల్గొన్నారు. టిడిపి ఆధ్వర్యంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జైచంద్ర నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు నివాళులర్పించారు. మండల కేంద్రంలోని దళితవాడలోని యువకులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి అంబేద్కర్ చిత్రపటాని గ్రామ వీధుల్లో ఊరేగించారు.



కుప్పంలోని కడా కార్యాలయంలో..

కుప్పం రూరల్ : భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని కుప్పం పట్టణం, మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కుల సంఘాలు, ప్రభుత్వ అధికారులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కడా కార్యాలయంలో పిడి వికాస్ మరమ్మాత్, పురపాలక సంఘం కార్యాలయంలో ఫ్లోర్ లీడర్ జిమ్ దాము ఆధ్వర్యంలో కమీషనర్ శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించగా, కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ నారాయణమూర్తి, బిసిఎన్ విద్యాసంస్థలలో అధ్యక్షులు బిసి.నాగరాజు అంబేద్కర్కు నివాళు లు అర్పించారు. టిడిపి నాయకులు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పల్లకి వాహనాలను అలంకరించి ఏపీఎస్ఆర్టీసీ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా చేరుకుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. యాదమరి మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ విశ్రాంత ఉపాధ్యాయులు జానకిరామ్ పిల్లై, సునందన్ రెడ్డి, ఎన్.వెంకటేశ్వర్లు, యోగశయనం, పాండియన్, త్యాగరాజులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పంటపల్లి సురేష్, ప్రభాకర్, వైఆర్.కృష్ణయ్య, శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

రామకుప్పం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్కు అఖిలపక్ష నేతలు ఘన నివాళులర్పించారు. సోమవారం వాడవాడల అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి 135వ జయంతిని పెద్ద ఎత్తున కేక్ కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. టిడిపి రాష్ట్రనేత మునస్వామి, మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, సీతాపతి, రామ్మూర్తి, చలపతి, కృష్ణా నాయక్, నందారెడ్డి, సలాం సబ్, జనసేన హరీష్, వైసిపి నేతలు బాబు రెడ్డి, సుబ్రహ్మణ్యం,మురుగేష్ పాల్గొన్నారు.

పలమనేరు: తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పట్టణంలోని పద్మశ్రీ సర్కిల్ నందుగల అంబేద్కర్ విగ్రహానికి పూజలు చేసి నివాళు లర్పించారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు, నాయకులు కుట్టి, గిరిబాబు, శ్రీధర్, మదన్, ఖాజా, చిన్ని, కిరణ్, గంగవరం మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు

అబద్ధ ప్రచారాలు మానుకోవాలి

మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత కుమారి

ప్రజాశక్తి -బంగారుపాళెం: కొందరు పార్టీ మారుతు న్నట్లు అబద్ధ ప్రచారాలు చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత కుమారి లు అన్నారు. మండలం లోని మొగిలి వెంకటగిరి లో సోమవారం విలేకరుల సమావేశం వైసిపి మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కూర్మాయిపల్లి పంచాయతీకి చెందిన వాసుదేవ రెడ్డి , మొగిలి రెడ్డి, గజేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి వైసిపి వీడి జనసేనలో చేరుతున్నట్లు అబద్ధ ప్రచారం చేస్తున్నారని ఒక కార్యక్రమం జరుగుతోందని భోజనానికి రావాలని ఆహ్వానించారని వెళ్లిన వెంటనే జనసేన కండువాలు వేసి ఫొటోలు తీసి సామాజిక మాధ్యమంలో ప్రచారం చేశారని తాము ఎప్పటికీ వైసిపిలోనే ఒక జగన్మోహన్ రెడ్డి తోనే నడుస్తామని జగన్మోహన్ రెడ్డి పెట్టిన ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొంటున్నామని అబద్ధ ప్రచారాలు మానుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, వైస్ ఎంపీపీ శేషీ రెడ్డి, కూర్మాయిపల్లి పంచాయతీ సర్పంచ్ హేమలత, బాబు రెడ్డి, నాయకులు పాలాక్షి రెడ్డి, థామస్, షాకీర్, నాగరాజ్ పాల్గొన్నారు.



టిడిపి సీనియర్ నేత గోపాల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఆ పార్టీ నాయకులు

టిడిపి సీనియర్ నేతకు నివాళి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని తిరువీధి కుప్పం పంచాయతీ జూపల్లి గ్రామా నికి చెందిన టిడిపి సీనియర్ రైతు నేత గోపాల్ రెడ్డి హఠాత్తుగా గుండె పోటు రావడంతో సోమవారం మృతి చెందా రు. విషయం తెలుసు కున్న టిడిపి నేతలు ఆయనకు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గోపాల్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు స్వామి దాస్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, జిల్లా వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి కోదండ రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, నాయకులు రాంబాబు రెడ్డి, హరీష్ యాదవ్, జ్యోతి రెడ్డి, బాబు నాయుడు, నటరాజ్ మొదలి, ప్రభాకర్ నాయుడు, జీవరత్నం, అశోక్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇంటిని కూల్చేశారు..!

బాధితుల ఆవేదన



ఇంటి పత్రాలు చూపుతున్న బాధితురాలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: తాతల కాలం నుండి నివసిస్తున్న తమ ఇంటిని దౌర్జన్యంగా కూల్చి వేశారని బాధితురాలు మోహన ఆవేదన వ్యక్తం చేశారు. తమ పూర్వికుల నుండి సర్వే నెంబర్ 158 బార్ 1 గ్రామకంఠం గ్రీన్ పేట దేవాంగ వీధిలో డోర్ నెంబర్ 4-827లో మిద్దె ఇంటిని కొండమ్మలే నివసి స్తున్న శివలింగం నాలుగు రోజుల క్రితం జెసిబిలతో కూల్చివేశాదని మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తనతో పాటు ఇద్దరు చెల్లెళ్లు , ఒక తమ్ముడు మొత్తం నలుగురు కుటుంబ సభ్యులు ఉన్నామని తన సోదరుడు త్యాగరాజన్ అక్క చెల్లెళ్లకు తెలియకుండా ఇంటి స్థలాన్ని అమ్మేశారని కుటుంబ సభ్యుల్లోని ముగ్గురు అక్క చెల్లెళ్లకు ఇంటి స్థలంలో హక్కు వుందన్నారు. ఈ మేరకు త్యాగరాజన్ అమ్మేసిన ఇంటి స్థలం చెల్లదని తెలిపారు. ఇంటి స్థలంలో తమకు వాటా కావాలని కోర్టును ఆశ్రయించామని కోర్టు కేసు నెంబర్ ఓఎస్ 271 , 2000టు2025 నెంబరు పేరుతో నడుస్తోందన్నారు.



వైభవంగా కాశీ విశ్వేశ్వర ఆలయంలో త్రిశూల స్నానం

ప్రజాశక్తి - రామకుప్పం: స్థానిక అన్నపూర్ణాసంత సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి అమ్మవార్లకు త్రిశూల స్నానం, వేద పండితులు నాగరాజు శర్మ కృష్ణమూర్తి నిర్వహించి అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం రుద్రా భిషేకం, పంచామృత భిషేకం చేసి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను ఆలయ మాడవీధుల్లో విహరింపజేశారు. సాయంత్రం వసంతోత్సవం, మహా మంగళహారతులు, ధూప దీప నైవేద్యాలు స్వామి వారికి సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన వసతి ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తుల తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి ఉభయ దారు లుగా వి విశ్వనాదయ్య కుటుంబీకులు వ్యవహరించారు.



మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు

సత్ప్రవర్తనతో మెలగాలి: సిఐ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ శ్రీనివాసులు అన్నారు . సోమవారం పోలీస్ స్టేషన్ లో రౌడీషీటర్లతో సమావేశం నిర్వ హించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమినల్ కేసులలో ఘర్షణలు పడి కేసుల నమోదు చేసుకుని రౌడీ షీటర్లుగా ఉన్నారని క్రమం తప్పక పోలీస్ స్టేషన్ కు హాజరు కావాలని సూచించారు సత్ప్రవర్తన కలిగిన వారిపై కేసులను తొలగిస్తామని దీనికి ప్రతి ఒక్కరు సహకరించి రౌడీషీటర్లు పేర్లను తొలగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, హెడ్ కానిస్టేబులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి పుంగనూరు రోడ్లో నిత్యం వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దళితుల ఆధ్వర్యంలో మండల ఎస్‌సి, ఎస్‌టి కమిటీ సభ్యులు డివో సుబ్రహ్మణ్యం, రామనపల్లి బాబు తిప్పన్న సుబ్రహ్మణ్యం శివకుమార్ సహకారంతో సోమవారం చలివేంద్రం ప్రారంభిం చారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా మండల మెజిస్ట్రేట్ మాధవ రాజు, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, ఎస్ఐ, టిడిపి మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం శెట్టి విచ్చేశారు. బిఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించి తహశీల్దారు మాధవ రాజు చేతుల మీదగా రిబ్బన్ కట్ చేయించి చలివేంద్రం ప్రారంభించారు. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి మజ్జిగ, పానకం, విందు భోజనం. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చలపతి. ప్రెస్ రిపోర్టర్లు శివకుమార్, సుబ్రహ్మణ్యం, గౌస్ పూర్ణచంద్ర గౌడ్, మాజీ ఎంపీటీసీ కృష్ణవేణి జయకుమార్ల కుమారుడు సాయి, రామనపల్లిబాబు, కొత్త ఇండ్లు తిప్పన్న, రవి, సుబ్రహ్మణ్యం తిప్పక్క, కళాకారుల బృంద సభ్యులు పాల్గొన్నారు.



గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్‌ను సన్మానిస్తున్న నాయకులు

గంగమ్మ గుడి చైర్మన్‌గా శ్రీధర్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ ఉత్సవ కమిటీని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సోమవారం ప్రకటించారు. గంగమ్మ ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా గంటావూరుకు చెందిన శ్రీధర్‌ను, వైస్ ఛైర్మన్‌గా శ్యామలమ్మ, చిన్నీ లను ఆయన ప్రకటించారు. గత కొద్ది రోజులుగా పట్టణానికి చెందిన శ్రీధర్, కోటేశ్వం లు ఛైర్మన్ పదవిని ఆశించారు. అయితే స్థానిక కూటమి నేతల అభిప్రాయ సేకరణ అనంతరం శ్రీధర్‌ను ఛైర్మన్ గా ప్రకటించారు. ఇక డైరెక్టర్‌లుగా విజయశేఖర్, ఐశ్వర్య లోకేష్, రోహిణి మురళీ, నాగరాణి ఆదెప్ప,ఈశ్వర్ ప్రసాద్, జనసేన కు చెందిన రాజేష్, బీజేపీకి చెందిన ఆనంద తీర్ధరావ్ లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపి సన్మానించారు. మరోవైపు కూటమి నాయకులు నూతన కమిటీ సభ్యులను సన్మానించి అభినందనలు తెలిపారు. తమపై పెట్టుకున్న నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా ప్రజలందరి సహకారంతో గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తామని ఛైర్మన్ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు బ్రహ్మయ్య, కుట్టి, గిరిబాబు, నాగరాజు,ఖాజా, మదన్, కిరణ్, జనసేన నాయకులు హరీష్, అరుణ్, చైతు పాల్గొన్నారు.



సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - రామకుప్పం:

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మండలంలోని 11 మంది లబ్ధిదారులకు టిడిపి నేతలు సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. వివిధ అనారోగ్యాల కారణాలతో వైద్య చికిత్సలు పొందిన రోగులకు సంబంధించిన ఫైళ్లను సీఎం సహాయనిధికి పంపారు. దీంతో 11 మందికి గాను ఎనిమిది లక్షల రూపాయలు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో పేద ప్రజలకు అండగా ఉంటూ వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపుతున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మునస్వామి, ఆనంద రెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, చలపతి, కృష్ణ నాయక్, సీతాపతి, నందా రెడ్డి, ముని రెడ్డి,విజయ్ రెడ్డి, సుబ్రీ, అవినాష్ ,శ్రీనాథ్ రెడ్డి, రఫీ,గిరిదాసు, బాలు, వెంకటరమణ, రామకృష్ణప్ప, మంజునాథ్ పాల్గొన్నారు.



కప్ గెలుపొందిన సామర్లగడ్డ జట్టు

క్రికెట్ లో సామర్లగడ్డ జట్టు ప్రతిభ

రన్నరప్‌గా రాజుపల్లి జట్టు

ప్రజాశక్తి -పెద్దపంజాణి:

మండలంలో రాజుపల్లి యూత్ ఆధ్వర్యంలో వారం రోజులుగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన బ్లూ వేల్స్ ప్రీమియర్ లీగ్ సీజన్ - 1 క్రికెట్ టోర్నమెంట్ లో విజేతగా గంగవరం మండలానికి చెందిన సామర్లగడ్డ టీమ్ సత్తా చాటి మొదటి బహుమతి గెలుచుకుంది. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడమే గాక వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాజుపల్లి యూత్ ఈ టోర్నమెంటును నిర్వహించింది. ఇందులో మొత్తం 12 టీమ్ లు పాల్గొని పోటీ పడగా విన్నర్లుగా సామర్లగడ్డ టీమ్ నిలిచి ట్రోఫీతో పాటు రూ. 50వేల బహుమతిని కైవసం చేసుకుంది. రన్నరప్ గా రాజుపల్లి బ్లూ వేల్స్-2 టీమ్ రాణించి రెండో విజేతగా ట్రోఫీ, రూ. 30వేల బహుమతి దక్కించుకుంది. విన్నర్, రన్నర్ టీములను నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ యశ్వంత్ రెడ్డి, నరేష్, వేణు, సుబ్బు, లోకేష్, చందు, దీపక్, గౌతమ్, రెడ్డి పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ తీగలు, స్తంభాలు
- వరిపైరు నేలమట్టం, రాలిన మామిడి - భారీ ఆస్తి నష్టం

ప్రజాశక్తి -వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం: జిడి నెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం మండలాల్లో మంగళవారం గాలీవాన బీభత్సం సృష్టిం చింది. గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు సైతం నేల కూలాయి. దీంతో విద్యుత్ సరఫరా ఆగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. తీవ్ర గాలుల కారణంగా సుమారు మూడు ఎకరాల్లో వరి పంట నేల వాలింది. మామిడి కాయలు రాలిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం ఎదురైంది. అధికారులు మొత్తం నష్టం అంచనా వేయాల్సి వుంది.

వెదురుకుప్పం మండలంలోని ఎగువ కనకాపురంలో గాలివాన బీభత్సం సృష్టించింది. సోమవారం ఉరుములు మెరుపులతో కూడిన గాలి వచ్చింది. ఈ గాలి వానకి మామిడి కాయలు రాలి పోయాయి. ఆ గ్రామంలో ఉన్న



వెదురుకుప్పం మండలంలో నేల కూలిన విద్యుత్ తీగలు, స్తంభం



చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారిపై నేల కూలిన భారీ వృక్షం

విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.. ఆస్తి నష్టం భారీగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎస్ఆర్‌పురం మండలంలో సోమవారం సాయంత్రం గాలి వాన బీభత్సంతో చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారిపై నెల వాయి గ్రామం వద్ద భారీ వృక్షం కూలి పోవడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. రాక పోక లకు తీవ్ర అంత రాయం కలిగింది. గంగమ్మ గుడి వద్ద బాలాజీ నాయుడుతో పాటు మరి కొంత మంది రైతుల వరి పంట గాలికి సుమారు మూడు ఎకరాలు నేల వాలింది. మండలంలో ప్రస్తుతం వరి పంట ఎక్కువగా ఉండటం వల్ల గాలివాన బీభత్సంతో రైతులు నిరాశకు గురయ్యారు. అధికారులు పంట నష్టం అంచనా వేయాల్సి వుంది.



ఎస్ఆర్‌పురంలో నేలవాలిన వరిపైరు..

కల్లూరులో ఏనుగుల దాడి

పంటపొలాలు ధ్వంసం



ప్రజాశక్తి -రొంపిచర్ల : పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీలో ఏనుగుల గుంపు అటవీ ప్రాంతాల సమీపంలోని పంట పొలాలపై సోమవారం దాడి చేసి నష్టం కలిగించాయి. ఈ మేరకు ప్రభుత్వం తమకు సాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతు న్నారు. దాడికి కట్టకిందపల్లికు చెందిన రైతు మధుకు చెందిన అరటి తోటను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. కమ్మపల్లి పంచాయతీ బాల్ రెడ్డి గారి పల్లి చెందిన రైతులు మోహన్ రెడ్డి, మనోజ్ ల కు చెందిన మామిడి తోటను, వరి పంటలను నాశనం చేసి, డ్రిప్పు పరికరాలను ధ్వంసం చేశాయి. తరచూ ఏనుగుల దాడితో పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నష్ట పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఇంటర్‌లో జీడీ నెల్లూరు విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఇంటర్ ఫలితాల్లో గంగాధర నెల్లూరు మండలం వేల్కూరు పంచాయతీకి చెందిన గుణ శేఖర్ కుమార్తె తనుశ్రీ 981 మార్కులతో టాపర్ గా నిలిపుత్తమ ప్రతిభను చాటింది. సాధారణ కుటుంబానికి చెందిన తనుశ్రీ ఇంటర్‌లో అత్యధిక మార్కుల సాధించ డంతో కుటుంబానికే కాకుండా గ్రామానికి కీర్తి ప్రతిష్టలు సంపాదిం చింది. ఈ సందర్భంగా తనుశ్రీని, తల్లి దండ్రులను గ్రామస్తులు ప్రజా ప్రతి నిధులు, కళాశాల సిబ్బంది అభినందిం చారు.



ఉత్తమ మార్కులు సాధించిన తనుశ్రీ

కూటమి ప్రభుత్వం వల్లే ఆమోదం: ఎమ్మెల్యే

- 'తిరుపతి-కాట్పాడి' రైల్వే డబ్లింగ్ లైన్ పనులు మంజూరు - కూటమినేతల విజయోత్సవం



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లో, దేశంలో కూటమి ప్రభుత్వాల వల్లే చిత్తూరు ప్రజల చిరకాల కోరిక తిరుపతి- కాట్పాడి రైల్వే డబ్లింగ్ లైన్ పనులకు ఆమోదం లభించిందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. సోమవారం ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, ఎమ్మెల్యేలు మురళీమోహన్, పులివర్తి నాని, చిత్తూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి చిత్తూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలించి విజయోత్సవాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా టిడిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు ప్రజల చిరకాల కోరిక అయిన కాట్పాడి-తిరుపతి రైల్వే రెండో లైన్ ప్రతిపాదనలను కేంద్రంలోని కూటమి ప్రభుత్వం ఆమోదించడం, పనులు కోసం రూ.1.332 కోట్లు మంజూరు చేయడం వెనక ముఖ్యమంత్రి , చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కృషి మరువలేనిది అన్నారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జిల్లాను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే కాకుండా, మౌలిక సదుపాయాలను మరింత ఆధునీకరించి ప్రజలకు అందించడానికి కృషి చేస్తారన్నారు. విజన్ కలిగిన సీఎం ఆధ్వర్యంలో విజన్ కలిగిన ఎంపీ పనిచేస్తున్నారని.. కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు రావలసిన మరిన్ని అభివృద్ధి పనులు త్వరలో సాధిస్తారని నమ్మకం ఉందన్నారు. రైల్వే డబ్లింగ్ లైన్ పనులకు ఆమోదం పొందినట్లే.. జిల్లాకు మ్యాంగో బోర్డు, రహదారుల అభివృద్ధి, ఇండస్ట్రియల్ కారిడార్ తెస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. చిత్తూరు నగరంలో మెసానిక్ మైదానం వద్దనున్న రైల్వే లైన్ పై బ్రిడ్జి మంజూరు అయినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం.. ప్రజల సంక్షేమం అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శిగా

శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాశక్తి-పూతలపట్టు: కడప జిల్లాలో ఆదివారం రాత్రి నిర్వహించిన పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశంలో పూతలపట్టు పీహెచ్ సీలో సిహెచ్‌వోగా పని చేస్తున్న శ్రీనివాస్‌ను రాయలసీమ జోనల్ సెక్రెటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది జిల్లాలకు సంబంధించి జోనల్ సెక్రెటరీగా అవకాశం ఇచ్చిన జోనల్ వైద్య బృందా నికి కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆస్కార రావు , రాష్ట్ర అధ్యక్షులు, అహరోను, రాష్ట్ర జనరల్ సెక్రటరీ టీడీకే. సాగర్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ హాజరయ్యారని ఆయన వివరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేయాలి

నాయకులకు ఎమ్మెల్యే సూచన

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్ : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో నాయకులు ముందుండాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. వి కోట మండల టిడిపి నాయకుల సమావేశం సోమవారం స్థానిక ఓ ప్రైవేట్ కల్యాణ మండపం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి మాట్లాడుతూ పలమనేరు నియోజక వర్గంలోని ప్రతి కార్యకర్త వారి గ్రామాల్లో వారే ఎమ్మెల్యేలని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యేందుకు నాయకులు కృషి చేయాలని కోరారు. పార్టీ అధిష్టానం ఆదేశానుసారం మండ లంలో కుటుంబ సాధికార సారది. ల ఎంపిక త్వరగా చేపట్టా లన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు ఒక్కొక్కటిగా నెరవేరు స్తుం దన్నారు. ఈ సమా వేశంలో నాయకులు రామచంద్ర నాయుడు, రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్‌గౌడ్, చౌడప్ప, నాగ భూషణం, ధీరజ్, శబరీష్, మహిళా అధ్యక్షురాలు శివకుమారి పాల్గొన్నారు.



ఆదర్శనీయులు అంబేద్కర్

ప్రజాశక్తి- పెద్దపంజాణి:

మండల వ్యాప్తంగా మండల మాల మహానాడు, అధ్యక్షులు మంజునాథ్, జై భీమ్ యూత్ ఫౌండేషన్ శంకర్, పలు ప్రజా సంఘాల నాయకులు అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ భారతదేశానికి భవిష్యత్తు మార్గ నిర్దేశకుడుగా అందరికీ ఆదర్శనీయుడని మండల మాల మహానాడు అధ్యక్షులు మంజునాథ్ అన్నారు. మండలం గోనుమాకులపల్లె గ్రామానికి చెందిన జై భీమ్ యూత్ ఫౌండేషన్ చైర్మన్ బి.శంకర్ భారత రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని పెద్దపంజాణి , గంగవరం, బైరెడ్డిపల్లి మండల కేంద్రాల్లో గల అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తూ ఆయన బాటలో నడుస్తూ పేదలను ఆర్థికంగా రాజకీయంగా బలోపేతం చేసే విధంగా కృషి చేస్తామని శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత నాయకులు జల్లి అమర నారాయణ, జిల్లా బహుజన సమాజ్ పార్టీ నాయకులు గోవిందు, బిసి నాయకులు పూసల రవి పాల్గొన్నారు.

బోరు మోటార్ల వద్ద కెపాసిటర్లు అమర్చండి

విద్యుత్ ఏఈ ప్రసాద్



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:

రైతు మోటార్లు స్టార్టర్లు ఓవర్ లోడ్ నివారణ నిమిత్తం కెపాసిటర్లు అమర్చాలని విద్యుత్ ఏఈ ప్రసాద్ పేర్కొన్నా రు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ప్రజలందరూ వ్యవసాయ బోర్లు , బావి సర్వీసులు కలిగిన వినియోగదారులు వారివారి బోరు మోటార్లకు ప్రతి ఒక్కరూ కెపాసిటర్లు అమర్చుకుంటే వారివారి ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్ లోడ్ పడకుండా నివారించుకోవచ్చునని తెలిపారు. దానివల్ల మీ మోటర్లు వారి ట్రాన్స్ఫర్మర్లు కూడా లైఫ్ టైము మరమ్మతులకు నోచుకోకుండా ఉంటాయని తెలిపారు. ప్రతి రైతు మీ బోరు మోటర్లకి కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. ఉదాహరణకు 10 హెచ్‌పి మోటార్ కి 4 కెవిఆర్ కెపాస్టరు అమర్చుకోవాలని ఈ కెపాసిటర్లు అమర్చడం వల్ల తమ డిపార్ట్మెంట్ కు విద్యుత్తు ఆదా అవుతుందన్నారు. ప్రతి ఒక్క రైతు కెపాసిటర్‌ను అమర్చుకోవాలన్నారు. ఆయన సిబ్బందితో మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ రైతులకు అవగాహన కల్పించి కెపాసిటర్లో అమర్చుకునే విధంగా మీరు చర్యలు చేపట్టాలని కోరారు.

పశు వైద్యాధికారిణి అశ్విని బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:


కాటూరు పంచాయతీకి చెందిన పశువుల వైద్యశాలకు వైద్యాధికారిణిగా సోమవారం ఉదయం అశ్విని బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో అన్నమయ్య జిల్లా నందులూరు మండలం, పాటూరు వైద్యశాలలో వైద్యాధికారిణిగా పనిచేస్తూ, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కాటూరు పశువైద్యశాలకు వచ్చారు.

తూనికలు కొలతల శాఖ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి -కోట :

కోట మండలం, విద్యానగర్ సెంటర్లో సోమవారం తూనికల శాఖల అధికారులు పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. గూడూరు లీగల్ మెట్రాలజీ శాఖ సీఐ మల్లేశ్వర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.

గ్రామ సభలతోనే గ్రామాల అభివృద్ధి: సర్పంచ్



బంగారుపాళ్యెంలో గ్రామ సభ నిర్వహిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గ్రామ సభలతోనే గ్రామా ల అభివృద్ధి సాధ్యమ వుతుందని సర్పంచి ఉమాదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి యుగంధర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని పురస్కరిం చుకుని గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉమాదేవి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకునేందుకు గ్రామసభలు ఎంతో ఉపయోగ పడతాయని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ముక్కుమ్మడిగా గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకునేందుకు గ్రామ సభ వేదిక అన్నారు. ఇదే మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డి గణపతి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజు, పలువురు వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు గ్రా మ పంచాయతీ కార్యాల యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో రాజశేఖర్ బాబు విచ్చేశారు. పారిశుధ్యం పరిశుభ్రతతో పాటూ గ్రామ సమస్యలు, వాటికి పరిష్కరించు కునే విధానం లాంటి కార్యక్రమాలపై గ్రామ సభల్లో చర్చించి, అభివృద్ధి పథంలో ముందుకెళ్లాలని సూచించారు. ఇలాంటి గ్రామ సభల వల్ల గ్రామాలు అభివృద్ధి చేసుకోవడానికి, సమస్యలపై చర్చించుకుని గ్రామాలు అభివృద్ధి చెందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పంచాయతీ సిబ్బందికి సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కల్లూరు గ్రామ సర్పంచ్ షుకూర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



రొంపిచర్లలో



కార్వేటినగరంలో నిర్వహిస్తున్న గ్రామ సభ

కార్వేటినగరం : సమస్యల పరిష్కా రానికే గ్రామసభ నిర్వహించామని ఈవోపీఆర్డి నాగ రత్నమ్మ అన్నారు. సోమవారం గ్రామ సభ ప్రారంభం ముందు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలు మాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ ఏం ధనంజయవర్మ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూలీలందరికీ పని కల్పించాలన్నారు. నాగరత్న మాట్లాడుతూ తాగునీటిని వేసవిలో దృష్టిలో పెట్టుకొని వృథా చేయకుండా చూడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మురళీకృష్ణ, రత్నం రెడ్డి,సచివాలయం సిబ్బంది ప్రజల పాల్గొన్నారు.